ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ


పూజలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: పట్టణంలోని మర్రి రాజిరెడ్డి కాలనీలో అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు నవీన్‌రెడ్డి ఇంటి వద్ద పడి పూజను చేశారు. వందల మంది అయ్యప్ప భక్తులు పూజలో పాల్గొన్నారు. భజనలు, పాటలతో పూజ కన్నుల పండువగా జరిగింది. ఎమ్మెల్యే మల్లారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి తదితర ప్రముఖులు పూజలో పాల్గొన్నారు.

అంటరానితనం నిర్మూలనకు అంబేడ్కర్ కృషి



ఘట్‌కేసర్: అంటరానితనం, అణచివేత నిర్మూలనకు అంబేడ్కర్ కృషి చేశారని మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ విభాగం అధ్యక్షుడు సతీష్ అన్నారు. ఆదివారం అంబేడ్కర్ ఆలోచనా విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో దాసు, నర్సింగ్‌రావు, సత్యం, శ్రీనివాస్, భానుచందర్, జగదీష్, అజయ్, వెంకటేశ్వర్‌రావు, గణేష్‌గౌడ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటల సమక్షంలో బీజేపీలో చేరికలు


బీజేపీలో చేరిన వారితో ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్: మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లికి చెందిన పలువురు యువకులు వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. అత్వెల్లికి చెందిన యువకులు పూడూర్‌లోని ఎంపీ ఈటల నివాసంకు స్థానిక బీజేపీ నాయకులతో కలిసి వెళ్లగా పార్టీలో చేరుతున్న వారికి ఈటల పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి నాయకులు ఆంజనేయులు, ఈశ్వర్ బాలకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు రిజర్వేషన్ అమలు చేయాలి

వీబీఐటీ ఫిజికల్ డైరెక్టర్, శ్రీనివాస్‌రెడ్డి



ఘట్‌కేసర్: క్రీడాకారులకు క్రీడాకోటా అమలు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వాలీబాల్ నేషనల్ రెఫ్రీ, అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. క్రీడలను ఆదరించాలని, క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తుంపు లభిస్తుందన్నారు. చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాముఖ్యత ఇవ్వాలని, ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి కులగణన సర్వే


కులగణన వివరాలు అందజేస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ కుల సర్వేను ఆదివారం అవుషాపూర్‌లో చేపట్టగా మాజీ ఎంపీపీ, మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డి తమ కుటుంబ వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేతకాక సర్వేలతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పేదలందరికి అందజేయాలని డిమాండ్ చేశారు.

భగవద్గీతపై ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న ఇందూ జ్ఞానవేదిక హైదరాబాద్ కమిటీ సభ్యులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్ గ్రామంలో త్రైత సిద్ధాంత–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక హైదరాబాద్ కమిటీ సభ్యులు భగవద్గీత, అనుబంధ గ్రంథముల ప్రచారం నిర్వహించి, కార్తీక మాసం, కార్తీక దీపం విశిష్టత వివరించారు. ప్రతీ హిందువూ భగవద్గీత పఠనం చేసి అందులోకి అంతరార్థం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు గిరి, సభ్యులు కుమార్, మధు, మహేష్, భాస్కర్, శోభ, అజయ్, హారిక, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ క్రియాశీలక సభ్యత్వ రసీదు అందజేత



కీసర: నాగారం మున్సిపాలిటీలో అత్యధికంగా 1350 మందితో బీజేపీ సభ్యత్వం నమోదు చేయించినందుకుగాను నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డికి క్రియాశీలక సభ్యత్వ రసీదును శనివారం నాగారం మున్సిపల్ బీజేపీ ఇన్‌చార్జి బుద్ది శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జశ్రీనివాస్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరసింహాగౌడ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రామక్కపేట రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీర్యాలలో.. సత్యనారాయణ వ్రతాల్లో భక్తులు



క్యూ లైన్‌లో భక్తజనం



ఘనంగా స్వామి వారికి ఇక్షు రసాభిషేకం


కీసరగుట్ట స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం


శివలింగాల వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కీసర: కార్తీకమాసోత్సవ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా ప్రఖ్యాత శైవ క్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో 4వ ఆదివారం స్వామివారికి ఇక్షు రసాభిషేకం (చెరుకు) పూజను పండితులు కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున గర్భాలయంలో కొలువైన శ్రీ స్వామివారికి (శివ లింగానికి) ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అనంతరం ఇక్షు రసాభిషేకం (చెరుకు) పూజను వైభవంగా చేశారు. ఆదివారం సెలవు దినం కావడం చేత స్వామి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామి దర్శనానంతరం ఆలయ పరిసరాల్లో ఉన్న శివలింగాల వద్ద కార్తీకదీపాలు వెలిగించారు. అనంతరం హుడాపార్కు తదితర ప్రాంతాల్లో యాత్రికులు కార్తీక వనభోజనాలు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మరో పక్క చీర్యాల దేవాలయానికి కూడా ఆదివారం వేలాదిగా భక్తులు విచ్చేశారు. అంతేకాకుండా మరోవైపు సత్యనారాయణ వ్రతాలు కూడా కొనసాగాయి.

వనభోజనాలు: కార్తీక మాసం సందర్భంగా ఆదివారం కీసర సమీపంలో మల్కాజ్‌గిరి తెలగ, కాపు, బలిజ సంఘం గౌరవ అధ్యక్షులు వడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో కాపు వనభోజన మహోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తు కుటుంబాల సమేతంగా కుల సంఘాలకు సంబంధించి ప్రజలు వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కీసరగుట్టలో నాగారం పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు నిర్వహించారు.


చీర్యాల ఆలయంలో భక్తుల రద్దీ


కీసరగుట్టలో కార్తీక వనభోజనాలు

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: ఆలయాలు ప్రశాంతతకు నిలయాలుగా ఉండాలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ పెంటారెడ్డి కాలనీలోని నిమిషాంబదేవి అన్నదానం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన అన్నప్రసాద భవన ప్రారంభోత్సవానికి ఆదివారం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకుని సన్మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం 2025 సంవత్సరం వార్షిక కేలండర్‌ను ఆవిష్కరించారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, కార్పొరేటర్ చీరాల నర్సింహ్మా, బీ– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, నేతలు దానగల్ల యాదగిరి, ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్, శ్రీనివాస్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా అంకుషాపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్, అంకుషాపూర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు అంకుషాపూర్ గ్రామం, ప్రిన్స్‌టన్ ఇంజనీరింగ్ కళాశాల, ఏఈసీ ఇంజనీరింగ్ కళాశాల తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ బలరాం తెలిపారు.

పడిపూజలో ఎమ్మెల్సీ కవిత



కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కుందనపల్లి ప్రజాసాయిగార్డెన్‌లో నివాసం ఉంటున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జాగృతి నాయకుడు విజయేందర్ గురుస్వామి ఆదివారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజకు ఎమ్మెల్సీ కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పూజకు హాజరై స్వామిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

వీరశైవుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: వీరశైవుల అభ్యున్నతికి తోడ్పాటును అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా వీరశైవ సమాజం కార్తీకమాస వనభోజన కార్యక్రమాన్ని ఆదివారం వాసవీశివనగర్ కాలనీలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మీ పిల్లల ఉన్నత చదువులకు కావాల్సిన సహకారం అందజేస్తానని, ఐకమత్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. వీరశైవ సమాజం అధ్యక్షుడు ప్యాట జ్ఞానేశ్వర్, గౌరవ అధ్యక్షుడు విశ్వనాథం, పద్మారెడ్డి, మహేష్‌గౌడ్, మర్రి మోహన్‌రెడ్డి, రమేష్ యాదవ్, లింగేశ్వర్, శివ, శశికుమార్, రాజష్, గంగా ఈశ్వరయ్య, శివానంద్, శంభులింగం, సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి


బోడుప్పల్: కాలనీల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేష్‌యాదవ్ అన్నారు. మల్లయ్య నగర్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మల్లయ్యనగర్‌లో కమ్యూనిటీహాల్ భవనం, హైమాస్ట్‌లైట్లు, మల్లయ్యనగర్ ముఖద్వారం ఏర్పాటుకు త్వరలో కృషిచేస్తానన్నారు. మల్లయ్యనగర్ కాలనీ అధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు వెంకటేష్‌ముదిరాజ్, కార్యదర్శి రామాంజనేయులు, కోశాధికారి అంజల్‌రెడ్డి, సలహాదారులు నాగభూషణం, స్వామి, కాలనీవాసులు పాల్గొన్నారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి



కుషాయిగూడ: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ కృష్ణప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ పీఎంజేఎఫ్ సురేష్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా రూ.45 వేల విలువైన కుట్టుమిషన్లను పేద మహిళలకు అందజేశారు. పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రూ.1,20,000 ఆర్థికసాయం అందజేశారు. లయన్స్ ప్రతినిధులు క్లెం కృష్ణారెడ్డి, కేఎస్.రెడ్డి, శేఖర్‌రెడ్డి, విజయ్‌కుమార్, కె.హనుమంతరావు, మనోజ్‌కుమార్‌యాదవ్, నాగన్న, దత్తు, పజ్జూరి పావనీరెడ్డి, రూప సుధాకర్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, రాఘవరెడ్డి, వంజరి ప్రవీణ్, జనార్ధన్‌గౌడ్, రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థిని అదృశ్యం


సాజిత (ఫైల్)

పోచారం: బీటెక్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లాలోని యాటవాకుల గ్రామానికి చెందిన షేక్ సాజిత (19) యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (సీఎస్‌ఈ) ద్వితీయ సంవత్సరం చదువుతూ.. సమీపంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటోంది. ఈ నెల 19న సాయంత్రం 4:30 గంటలకు ఆమె తల్లి షేక్ లాల్‌బీతో ఫోన్‌లో మాట్లాడింది. ఆ తర్వాత రోజు నుంచి సాజిత ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండటంతో ఆమె గురించి హాస్టల్ యాజమాన్యాన్ని అడిగారు. నాలుగు రోజులు కాలేజీకి సెలవులు ఇవ్వడంతో తల్లి ఆరోగ్యం బాగోలేదని, ఊరువెళ్లి చూసివస్తానని చెప్పి హాస్టల్ నుంచి ఈ నెల 7న వెళ్లిందని తెలిపారు. దీంతో ఆమె కోసం ఎంత గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో 23న లాల్‌బీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి



శామీర్‌పేట్: శామీర్‌పేట మండలంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆదివారం పర్యటించారు. మండల పరిధిలోని అలియాబాద్ చౌరస్తాలో గల రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల ప్రారంభ పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం తుర్కపల్లి గ్రామంలో జరుగుతున్న మైసమ్మ జాతరలో పాల్గొన్న ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు సీతారాములుగౌడ్, మాజీ జెడ్పీటీసీ అనితలాలయ్య, బీఆర్‌ఎస్ నాయకులు జగదీష్‌గౌడ్, నర్సింహారెడ్డి, సాయిబాబు పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా సబిత


సీపీఎం మండల కార్యవర్గంతో ముఖ్యఅతిథులు అశోక్, సృజన


ఘట్‌కేసర్‌లో.. సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న చంద్రమోహన్

ఘట్‌కేసర్: పట్టణంలో సీపీఎం ఆరో మండల మహా సభలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు చంద్రమోహన్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శిగా సబితను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా యాదయ్య, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రమోహన్, ఉదయ్, యాదగిరి, నాగమణి, అలివేలును ఎన్నుకున్నారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి అశోక్, సభ్యురాలు సృజన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు, మహిళలు, నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలన్నారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో ప్రగతి నగర్‌లో నిర్వహించనున్న జిల్లా మూడో మహాసభలకు అధిక సంఖ్యలో ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని, ప్రధానంగా పార్టీ బలోపేతం పై దృష్టిసారించాలని పిలుపునిచ్చారు.

గోధుమకుంటలో వైద్య శిబిరం



కీసర: గోధుమకుంటలో ఓమౌజియా ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. గోధుమకుంట గ్రామ పంచాయతీ కార్యాలయం ఆదివారం ఉదయం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన ఉస్మానియా, యశోద ఆసుపత్రులకు చెందిన వైద్యులతో ప్రజలకు ఉచితంగా సుమారు 300 మంది ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఓమౌజియా శ్రీ భవతి క్షేత్ర పాలక మండలి అధ్యక్షులు భవసింగ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి

టాలెంట్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ


మాట్లాడుతున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: విద్యార్థులు కష్టపడి చదువుకుని తమ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ 18వ డివిజన్‌లోని సహస్ర అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆదివారం ఆయన మెమోంటోలు, సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పట్టుదలతో కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయిలో ఉండేందుకు కృషి చేయాలన్నారు. స్థానిక కార్పొరేటర్ పులకండ్ల హేమలతాజంగారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ బీ- బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, సహస్ర అకాడమీ డైరెక్టర్ నరేష్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, నేతలు నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు కుట్టిన మహిళలకు

డబ్బులు అందేనా..?

- పెద్ద ఎత్తున పేరుకుపోయిన బకాయిలు
- ఈ విద్యా సంవత్సరంలో దుస్తులు కుట్టి ఇచ్చిన మహిళా సంఘాలు
- 507 ప్రభుత్వ బడుల్లోని 89,565 మంది విద్యార్థులకు దుస్తుల పంపిణీ
- పాఠశాలల ప్రారంభంలోనే యూనిఫామ్‌లు అందజేత



సాక్షి,సిటీబ్యూరో: ఏక రూప దుస్తులు కుట్టిన మహిళా సంఘాల సభ్యులకు నెలలు గడిచినా కూలి డబ్బులు చెల్లించకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఉరుకులు, పరుగులతో రాత్రింబవళ్లు శ్రమించి సకాలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫామ్స్) అందించామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే విద్యార్థుల యూనిఫామ్‌లకు అవసరమైన వస్త్రాన్ని జిల్లాలకు ప్రభుత్వం సరఫరా చేసింది. అలాగే, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారులకు విద్యార్థుల ఏక రూప దుస్తులు కుట్టించే బాధ్యతను అప్పగించారు. విద్యార్థుల ఏకరూప దుస్తులు మహిళా సంఘాల సభ్యులు కుట్టేలా డీఆర్‌డీఏ అధికారులు చర్యలు తీసుకోగా, వారు రాత్రింబవళ్లు కష్టపడి సకాలంలో పూర్తి చేశారు. దుస్తులు కుట్టి నెలలు గడిచినా ఇప్పటి వరకు కూలి డబ్బులు చెల్లించకపోవటంతో మహిళా సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

23 కుట్టు సెంటర్లు.. 1200 మంది మహిళలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 89,565 మంది విద్యార్థులకు రెండు జతలు ఏకరూప దుస్తులు కుట్టించేందుకు సరిపడు వస్త్రాన్ని ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ దుస్తులను సకాలంలో కుట్టేందుకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ వివిధ ప్రాంతాల్లో 23 కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేసింది. దుస్తులను కుట్టేందుకు ప్రభుత్వం తక్కువ ధర (కూలి) నిర్ణయించటంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ మహిళా సంఘాలకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే ఏకరూప దుస్తులు కుట్టేందుకు 23 కేంద్రాల్లో 1200 మంది మహిళలు ముందుకు వచ్చి.. లక్ష్యానికి అనుగుణంగా ఏకరూప దుస్తులు కుట్టారు. ఒక్కొక్క జతకు మహిళా సంఘాలు (కేంద్రం నిర్వాహకులు) రూ.50లు, రాష్ట్ర ప్రభుత్వ తరపున రూ.25లు కలిపి మొత్తంగా రూ.75 చెల్లించాల్సి ఉంది. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వరంలో మొదటి విడతగా ఏకరూప దుస్తులు కుట్టిన మహిళలకు ఇప్పటి వరకు రూ.44,39,550 మాత్రమే చెల్లించారు.

సకాలంలో డబ్బులు అందక..

ఆర్థిక సాధికారత పొందేలా విద్యార్థులకు యూనిఫాం కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించినా, ప్రభుత్వం వారికి కూలి డబ్బులను సకాలంలో చెల్లించకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏక రూప దుస్తుల(యూనిఫామ్) కూలి డబ్బులకు సంబంధించి మహిళా సభ్యులకు ఇంకా బకాయిలు రూ.88,55,700 చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సర్కారు దుస్తులను పంపిణీ చేస్తుండగా, వాటిని కుట్టే బాధ్యతలను మహిళా సభ్యులకు అప్పగించారు. జిల్లాలోని 507 ప్రభుత్వ పాఠశాలల్లో 89,565 విద్యార్థులు చదువుతుండగా, ఇందులో బాలురు 44,184 మంది బాలికలు 45,381 మంది ఉన్నారు. విద్యార్థుల యూనిఫామ్‌లకు అవసరమైన క్లాత్‌ను (వస్త్రాన్ని)ప్రభుత్వం కొనుగోలు చేయగా, టెస్కో ద్వారా మహిళా సంఘాలకు సరఫరా చేశారు. విద్యార్థులకు సరిపడు క్లాత్ 1,81,719 మీటర్లు 144 మహిళా సంఘాల్లో టైలర్ పని చేసే 1200 మంది మహిళా సభ్యులకు అందజేయగా, వారు కుట్టారు.

మహిళలు కుట్టిన డ్రెస్ డిజైన్ ఇలా..

ఒకటి నుంచి మూడో తరగతి వరకు బాలికలకు ఫ్రాక్‌తో కూడిన యూనిఫామ్, 4, 5 తరగతుల బాలికలకు స్కర్ట్, 6 నుంచి 10 తరగతి చదువుతున్న బాలికలకు పంజాబీ డ్రెస్‌తోపాటు వాస్కోటును ఆకర్షణీయంగా మహిళా సభ్యులు డిజైన్ చేసి కుట్టారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న బాలురకు రెడ్, యాష్ కలర్ చెక్స్ ప్రింటింగ్ షర్ట్, మెరూన్ కలర్ నిక్కర్, 8 నుంచి 10వ తరగతి చదువుతున్న బాలురకు షర్ట్, ప్యాంటు అందించారు.